క్లుప్తంగా

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి పోరంకి ప్రాంతంలో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శనివారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో శివసదన్ రోడ్డును మున్సిపాలిటీ నిధులు రూ. 39 లక్షలతో 328 మీటర్ల మేర సిమెంట్ రోడ్డు నిర్మించనున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు అనుమోలు ప్రభాకరరావు, స్థానికులు పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

పెనమలూరు: కానూరులో వృద్ధురాలు అదృశ్యమైన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. వృద్ధ దంపతులు తుమ్మల సాధ్వి, శ్యామ్‌ప్రసాద్ కానూరులో నివాసం ఉంటున్నారు. కాగా గురువారం వారు మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత నిద్రపోయారు. భర్త శ్యామ్‌ప్రసాద్ లేచి చూడగా భార్య సాధ్వి కనబలేదు. దీంతో బెంగుళూరులో ఉంటున్న కుమారుడు వేణుకు సమాచారం ఇచ్చాడు. వేణు కానూరుకు వచ్చి తల్లి కోసం వెతుకగా ఆమె కనబడలేదు. దీంతో తన తల్లి కనిపించడం లేదంటూ వేణు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఘనంగా చేశారు. ఉదయం ఏడు గంటలకు శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకం చేశారు. అనంతరం అర్చనలు, పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామివారిని పల్లకీలో ఊరేగించి కల్యాణం చేశారు. శ్రీసాయి భక్తులచే భజన కార్యక్రమం జరిగింది. భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్, ఆలయ నిర్మాణ దాత సంగా నరసింహారావు, ఆలయ ఈఓ ఎస్.భవాని, భక్తులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలు బహూకరణ



పెనమలూరు: పోరంకి గ్రామంలోని సుగాలి కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గ్రామానికి చెందిన భక్తులు నాగమల్లేశ్వరిదేవి, వెంకటనాగసత్యనారాయణ స్వామివార్ల వెండి విగ్రహాలు బహూకరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా స్వామివార్లకు కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనగా తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బ్యాంకర్ల సహకారంతో సైబర్ నేరాల నియంత్రణ

పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు



విజయవాడస్పోర్ట్స్: ముందస్తు అవగాహన, జాగ్రత్తలు పాటించడం ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. భారీ సైబర్ నేరం జరగకుండా అడ్డుకున్న బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ)గవర్నర్‌పేట బ్రాంచ్ మేనేజర్ సూర్యనారాయణ, అధికారులు ఆంజనేయులు, భానులను శనివారం తన కార్యాలయంలో కమిషనర్ రాజశేఖరబాబు ఘనంగా సత్కరించారు. కమిషనర్ మాట్లాడుతూ ఈనెల ఆరో తేదీన ఓవ్యక్తి కంగారుగా బ్యాంక్‌కు వచ్చి తన ఖాతాలోని నగదును వేరే వ్యక్తి ఖాతాలోకి బదిలీ చేయాలని బ్యాంకు అధికారులు ఆంజనేయులు, భానులను కోరగా అనుమానం వచ్చిన వారు ఈ విషయాన్ని వెంటనే మేనేజర్ సూర్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారన్నారు. గతంలో బ్యాంకు సిబ్బందికి తాము ఇచ్చిన ప్రశ్నావళి ఆధారంగా సదరు వ్యక్తి సైబర్ నేరానికి గురయ్యాడని మేనేజర్ గ్రహించి వెంటనే అతని బ్యాంకు ఖాతాను సీజ్ చేసి నగదు వేరే ఖాతాలకు బదిలీ కాకుండా జాగ్రత్తలు తీసుకున్నారని అభినందనీయమన్నారు. డిజిటల్ అరెస్ట్, కస్టమ్ అధికారుల పేరుతో వస్తున్న ఫేక్ ఫోన్‌కాల్స్‌ను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా



కంకిపాడులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం



కార్యాలయం వెలుపల ఉన్న మందు సీసాలు

- ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం చుట్టూ ఆకతాయిల తిష్ట
- రాత్రిళ్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న మందుబాబులు
- అధ్వానంగా పరిసరాలు
- పట్టించుకోని అధికారులు

కంకిపాడు: అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ పరిసరాలు వేదికగా మారాయి. రాత్రిళ్లు కార్యాలయం చుట్టూ ఆకతాయిలు తిష్ట వేసి యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. కార్యాలయం చుట్టూ పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నా సంబంధిత అధికారులు మాత్రం కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. కంకిపాడు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఉంది. పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు ఈ ప్రాజెక్టు కార్యాలయం పరిధిలోకి వస్తాయి. సీడీపీఓ, సూపర్‌వైజర్లు, పలువురు సిబ్బంది ఈ కార్యాలయం ద్వారా ప్రాజెక్టు సేవలను పర్యవేక్షిస్తుంటారు.

కార్యాలయానికి గేట్లు కూడా లేవు

కొద్ది రోజులుగా ప్రాజెక్టు కార్యాలయం పరిసరాలు మందుబాబులకు అడ్డాగా తయారైంది. రాత్రిళ్లు మందుబాబులు ప్రాజెక్టు కార్యాలయాన్ని వేదికగా మార్చుకుని మద్యం సేవిస్తున్నారు. మద్యం సీసాలు, ఆహార పదార్థాల ప్యాకెట్లు, గ్లాసులతో ప్రాంగణం నిండిపోతుంది. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోకి రాత్రిళ్లు ఎవరూ ప్రవేశించకుండా ఉండేలా గేట్లు కూడా లేవు. దీంతో ఆకతాయిలు రాత్రయితే చాలు ప్రాంగణంలోకి వెళ్లి అసాంఘిక కార్యకలాపాలకు తెగబడుతున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు

ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఆకతాయిలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణం అని తెలిసినా మద్యం సేవిస్తూ, ఇతర అసాంఘిక చర్యలకు వినియోగించుకుంటున్నారు. కార్యాలయ సిబ్బంది కనీసం పరిసరాల పరిశుభ్రతను కూడా పట్టించుకోవడం లేదు. పరిసరాలు మొత్తం మద్యం సీసాలు, గ్లాసులు, వర్థ్యాలతో అస్తవ్యస్తంగా తయారైంది. నిత్యం అధికారులు, వివిధ గ్రామాల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ కార్యాలయ సేవల కోసం నియోజకవర్గంలోని ప్రజలు వస్తుంటారు. అయినా అధికారులు కార్యాలయం పరిసరాల నిర్వహణపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

విద్యార్థుల భవిష్యత్తుకు కృషి చేయాలి



పెనమలూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్



కోలవెన్నులో విద్యార్థులకు ప్రగతి నివేదికలను అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు



బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో రంగవల్లుల పోటీలు

పెనమలూరు: విద్యార్థుల భవిష్యత్తుకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పేరెంట్స్–టీచర్స్(పీటీఎం) ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి సమన్వయంతో బంగారు బాట వేయాలని సూచించారు. ఎంఈఓ కనకమహాలక్ష్మి, హెచ్‌ఎం దుర్గాభవాని, గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు, పాఠశాల పూర్వ విద్యార్థులు కిలారు శివకుమార్, కిలారు బసవపున్నయ్య, కమిటీ చైర్మన్ ఖైరున్‌బీ పాల్గొన్నారు. అనంతరం శుభదిన్ భోజన కార్యక్రమం నిర్వహించారు. కాగా ప్రభుత్వం నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి పలు పాఠశాలల్లో స్పందన కనబడలేదు. టీచర్స్ మాత్రమే హడావిడి చేసి పీటీఎం సమావేశం నిర్వహించారు.

- కంకిపాడు: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో మెగా పీటీఎం సమావేశాలను శనివారం నిర్వహించారు. కోలవెన్ను, కంకిపాడు, ఈడుపుగల్లు తదితర గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమన్నారు. నిరంతరం విద్యార్థుల ప్రగతిని పర్యవేక్షిస్తూ సన్మార్గంలో నడిచేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో పాఠశాల విద్య అదనపు కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, కంకిపాడు సర్పంచ్ బాకీ రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, కోలవెన్ను సర్పంచ్ సీహెచ్ సురేష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు తోకల ఉమాదేవి, మాజీ ఉపసర్పంచ్ కంచర్ల శేషగిరి తదితరులు పాల్గొన్నారు. కంకిపాడు జెడ్పీ పాఠశాలలో జరిగిన పీటీఎం సమావేశంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు చిట్టూరి ప్రసాద్, హెచ్‌ఎం సుధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- ఉంగుటూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పేరెంట్స్ కమిటీ సమావేశం జరిగింది. ఆత్కూరు, పొట్టిపాడు గ్రామాల్లో జరిగిన సమావేశాలకు ఎంపీపీ వడ్లమూడి సరోజిని హాజరయ్యారు. ఈ సందర్భంగా పేరెంట్స్‌కు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, హెచ్‌ఎంలు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పేరెంట్–టీచర్స్ మీటింగ్స్ జరిగాయి. ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత విద్యార్థుల ప్రగతి నివేదికను వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం తల్లిదండ్రులకు పలు పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కాగా పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ యర్రగొర్ల నగేష్, వైస్ ఎంపీపీ చందు రమాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్, స్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, ఎంఈఓ శ్రీరామ్ బాలాసింగ్ పాల్గొన్నారు.
- ఉయ్యూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పీటీఎం కార్యక్రమాలు నిర్వహించారు. ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొని విద్యార్థులకు ప్రగతి నివేదికలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, హెచ్‌ఎం జ్యోత్స్నాదేవి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.
- గన్నవరం రూరల్: మండలంలోని పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్స్ శనివారం జరిగాయి. ముస్తాబాద జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థి కందిమళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మొదటి ముగ్గురికి నగదు బహుమతులు అందజేస్తానని తెలిపారు. సర్పంచ్ వేము రాధాకృష్ణ, హెచ్‌ఎం శ్రీపతి రామ్‌గోపాల్, వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్ జెట్టి నానారావు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువులపై ప్రత్యేక శ్రద్ధ



దావాజీగూడెంలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ రవి

గన్నవరం: విద్యార్థుల చదువులపై ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీపీ అనగాని రవి పిలుపునిచ్చారు. మండలంలోని అల్లాపురం ఎంపీపీ పాఠశాల, దావాజీగూడెం జెడ్పీ హైస్కూల్‌లో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ రవి పాల్గొని ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల తల్లులకు బహుమతులు అందజేశారు. సర్పంచి డొక్కు వెంకన్నబాబు, హెచ్‌ఎంలు, పేరెంట్స్ కమిటీలు పాల్గొన్నాయి. అలాగే స్థానిక జెడ్పీ బాలుర, బాలిక హైస్కూల్స్‌లో జరిగిన సమావేశాల్లో ఎంఈఓ కొండా రవికుమార్ పాల్గొన్నారు. స్థానిక చింతలపేట ఎంపీపీ స్కూల్‌లో ఎంపీటీసీ సభ్యుడు మద్దినేని వెంకటేశ్వరరావు చేతుల మీదుగా సమగ్ర ప్రగతి పత్రాలను పంపిణీ చేశారు. కేసరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో వైస్ ఎంపీపీ–2 కాలగడ్డ శివనాగ రాజకుమారి, సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక, హెచ్‌ఎం పాల్గొన్నారు. స్థానిక రాయ్‌నగర్‌లోని ఎంపీపీ పాఠశాలలోనూ సమావేశం జరిగింది.

‘మద్దతు’కోసం అన్నదాతల పాట్లు

- రోడ్ల మీద ఆరబోస్తున్న ధాన్యం
- తేమశాతం తగ్గితే మంచి రేటు వస్తుందంటున్న రైతులు
- కూలీల ఖర్చు భారమైనా ధాన్యం ఆరబోత పనుల్లో నిమగ్నం



మద్దూరులోని రియల్ ఎస్టేట్ వెంచరులో ధాన్యం ఆరబోస్తున్న కూలీలు



గొడవర్రు ప్రధాన రోడ్డు మార్గంలో ఆరబోసిన ధాన్యం

కంకిపాడు: మద్దతు ధరను పొందేందుకు రైతులు పాట్లు పడుతున్నారు. ధాన్యం ఆరబోతకు కూలీల ఖర్చు భారమైనా తేమ శాతం తగ్గితే మంచి ధర లభిస్తుందని అన్నదాతలు ఆశాభావంతో ఉన్నారు. ధాన్యం ఆరబోసి మిల్లులకు తరలించే పనుల్లో నిమగ్నమవుతున్నారు. పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో ఈ ఏడాది 34,977 ఎకరాల్లో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు జరిగింది. 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇప్పటికే రైతులు మిల్లులకు తరలించారు.

అదనపు పెట్టుబడి ఖర్చులు...

ఇటీవల ఫెంగల్ తుపాను భయంతో రైతులు వణికిపోయారు. వారం క్రితం పూర్తిగా వాతావరణంలో మార్పు వచ్చింది. ఆకాశం మేఘావృతమై కారు మబ్బులు కమ్మాయి. మోస్తరు వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు, ప్రధాన రోడ్లపై ఆరబోసిన ధాన్యం రాసుల అడుగున నీరు చేరి మొలకలు వచ్చిన పరిస్థితి నెలకొంది. మొలకలు వచ్చిన ధాన్యాన్ని రాసి నుంచి వేరు చేసి మిగిలిన ధాన్యాన్ని అతికష్టం మీద సంరక్షించుకున్నారు. మొలక రావడంతో చాలా గ్రామాల్లో రైతులు ఒక్కో ఎకరాకు ఏడు బస్తాల వరకూ ధాన్యం నష్టపోయారు. అయితే మిగిలిన పంటకు మద్దతు ధరను పొందేందుకు రైతులు దృష్టి సారించారు. నాలుగు రోజులుగా వాతావరణం తెరపివ్వడం, పగటి ఉష్ణోగ్రతలు పెరగడం, ఎండ కాస్తుండటంతో ధాన్యం ఆరబోత పనుల్లో నిమగ్నమయ్యారు. ఎకరం ఆరబోతకు ముగ్గురు నుంచి నలుగురు కూలీలు పని చేస్తున్నారు. రోజుకు రూ. 1,500 చొప్పున నాలుగు రోజులకు ఆరబోతకు రూ. ఆరు వేలు వరకూ పెట్టుబడి అదనంగా అవుతోంది. అయినా ధాన్యం ఆరబోతతో తేమశాతం ప్రభుత్వ నిబంధనలకు లోబడి 17 శాతంకు వస్తే 75 కిలోల బస్తాకు రూ. 1,700పైగా ధర లభిస్తుందనే ఆశతో ఉన్నారు.

ఎక్కడ చూసినా ధాన్యం రాసులే..

నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో ధాన్యం మార్కెట్‌కు చేరుతోంది. రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో ధాన్యం రాసులు నిల్వ చేస్తున్నారు. రాత్రివేళ మంచుకు ధాన్యం నిమ్ముకుపోకుండా పరదాలు కప్పి నాణ్యత దెబ్బతినకుండా సంరక్షించుకుంటున్నారు.

ప్రభుత్వ పాఠశాల్లో ఉన్నత విద్యా ప్రమాణాలు

కలెక్టర్ డీకే బాలాజీ



పోరంకి జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

పెనమలూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యా ప్రమాణాలతో బోధన చేస్తున్నారని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్ టీచర్ సమావేశంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వ బడులు మరింత అభివృద్ధి చేయడంతో పాటు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యా ప్రమాణాలు అమలు చేస్తామన్నారు. ప్రభుత్వం పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రణాళికలు రూపొందిస్తోందని తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో నైపుణ్యమున్న ఉపాధ్యాయులు ఉన్నారని వారితో విద్యార్థులకు మేలు కలుగుతుందని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలతో పోల్చితే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు విద్య, క్రీడా ఇతర రంగాల్లో రాణిస్తున్నారన్నారు. విద్యార్థులు మరింత అభివృద్ధి సాధించడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలో విద్యాబోధన పద్ధతులు, మధ్యాహ్న భోజన పథకం, పాఠశాలలో మౌలిక వసతులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పరిస్థితులపై మాట్లాడారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం వచ్చారు.. గుంతలు పూడ్చారు



పోరంకి-నిడమానూరు రోడ్డులో మరమ్మతులు

పెనమలూరు: సీఎం చంద్రబాబునాయుడు పర్యటనతో పోరంకి–నిడమానూరు రోడ్డుకు హడావిడిగా మరమ్మతులు చేశారు. పోరంకి నుంచి నిడమానూరు వరకు దాదాపు మూడు కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డు గుంతలమయంగా ఉంది. ఈ రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం ఇంతకాలం ముందుకు రాలేదు. అయితే శనివారం పోరంకిలో సీఎం పర్యటన ఉండటంతో అధికారులు ఒక్కసారిగా మేల్కొన్నారు. గత రెండు రోజులుగా నిడమానూరు రోడ్డు మరమ్మత్తులు చేపట్టారు. రోడ్డు పూర్తిగా నిర్మాణం చేయకుండా తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి గుంతలు పూడ్చారు. వాస్తవానికి ఈ రోడ్డుపై నిత్యం ఉన్న ట్రాఫిక్ దృష్ట్యా రోడ్డు విస్తరించి పూర్తిగా నిర్మాణం చేయాలి. అయితే పైపై మెరుపులుగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకొన్నారు.

తమలపాకులతో సహస్ర నామార్చన



ప్రత్యేక అలంకరణలో శ్రీఆంజనేయస్వామివారు

గన్నవరం: మండలంలోని దావాజీగూడెంలో వేంచేసియున్న శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం మార్గశిర మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత స్వామివారికి సుప్రభాత సేవ, విశేష అర్చనలు జరిగాయి. అనంతరం ఉపాలయంలోని శ్రీఆంజనేయస్వామికి 11 వేల తమలపాకులతో సహస్ర నామార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసీతారామచంద్ర స్వామివారికి వివిధ రకాల పరిమళ భరిత పుష్పాలతో జరిపిన విశేష అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. అనంతరం ఆలయ అర్చకుడు ఎస్. రామాచార్యులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వివరణ చేశారు.

విద్యార్థులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శాస్త్రవేత్త శైలజారాణి

ఉయ్యూరు: విద్యార్థులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఉయ్యూరు చెరకు పరిశోధనాస్థానం శాస్త్రవేత్త శైలజారాణి సూచించారు. పట్టణంలోని ఎంకే ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పౌష్టికాహార పదార్థాలపై శనివారం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తయారు చేసిన పౌష్టికాహార పదార్థాలను శైలజారాణి రుచి చూసి విజేతలను నిర్ణయించారు. ఆయా విభాగాల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఆమె మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. రక్తహీనతను అధికమించేలా ఆహార అలవాట్లు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ ఎంకే బాబు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



కల్యాణోత్సవం జరిపిస్తున్న ఆలయ అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివారి కల్యాణోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివార్ల ఉత్సవ మూర్తులకు కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు జరిపించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని స్వామివారి ఆలయం నుంచి ఉత్సవ మూర్తులకు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉత్సవ మూర్తుల వద్ద తొలుత గణపతి పూజ, అనంతరం స్వామి వారి కల్యాణాన్ని ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా జరిపించారు. ఆలయ ఈఓ కె.ఎస్. రామరావు దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఉత్సవ మూర్తులకు ఊరేగింపుగా నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనడం ద్వారా ఆర్థిక ఇబ్బందులతో పాటు వివాహం కాని వారికి వివాహ యోగం, సంతానం లేని వారికి సంతాన యోగం కలుగుతాయని ఆలయ వైదిక కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

సంగీతమే నాకు జీవితం

ప్రముఖ నేపథ్య గాయకుడు సిద్ శ్రీరామ్



మీడియాతో మాట్లాడుతున్న ప్రముఖ సింగర్ సిద్ శ్రీరామ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): మ్యూజిక్ తన లైఫ్, రామానుజం తన గురువని ప్రముఖ సింగర్ సిద్ శ్రీరామ్ అన్నారు. ఫిబ్రవరి 8న నగరంలో నిర్వహించనున్న లైవ్ పెర్ఫామెన్స్ కార్యక్రమానికి సంబంధించిన బిగ్ టికెట్ బ్రోచర్‌ని శనివారం ఆయన ఆవిష్కరించారు. మహాత్మాగాంధీరోడ్డులోని హోటల్ గేట్‌వేలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిద్ శ్రీరామ్ మాట్లాడుతూ విజయవాడతో తనకు ఎంతో అనుబంధం ఉందని, ఇక్కడ లైవ్ పెర్ఫామెన్స్ ఇవ్వనుండడం చాలా సంతోషంగా ఉందన్నారు. నేను తమిళం అయినా తెలుగులోనే హిట్స్ ఉన్నాయన్నారు. వేగా జ్యువెలర్స్ అధినేత నవీన్, శ్రేయస్ లైవ్ ఈవెంట్ ప్రతినిధి విపున్ పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరి

విజయవాడ కల్చరల్: స్థానిక దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత ఉత్సవాల్లో భాగంగా శనివారం చెన్నైకి చెందిన సాంతూర్ కృష్ణ రామరత్నం ఆలపించిన సంప్రదాయ కీర్తనలు అందరినీ అలరించాయి. పెరవలి నందకుమార్, పెరవలి విజయభాస్కర్, కే హరిబాబు వాద్య సహకారం అందించారు.